సాక్షి
విజయనగరం
మంగళవారం ׀ 20 ׀ ఆగస్టు ׀ 2024



పొంచిఉన్న రక్త పిశాచాలు
దోమలు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. మలేరియా, డెంగీ, చికున్ గున్యా జ్వరాలతో జనాన్ని మంచం పట్టిస్తున్నాయి. - 8లో




ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు - 8లో
జిల్లా వేదికగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సీనియర్ స్త్రీ, పురుషుల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి.



వినతుల పరిష్కారానికి కమాండ్ కంట్రోల్ రూమ్ - 8లో
ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతుల పరిష్కారానికి కమాండ్‌కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు.

విద్యుత్ ఇక్కట్‌లు..!

వర్షాకాలం.. జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉన్నా విద్యుత్ కోతలు మాత్రం వేసవిని తలపిస్తున్నాయి. సరఫరా ఎప్పుడు నిలిచిపోతుందో తెలియదు.. ఎంత సమయం సరఫరా అవుతుందో చెప్పలేని పరిస్థితి. వ్యవసాయ మోటారు ఆన్‌చేసి నీరు పొలానికి చేరుకునేలోగా పవర్ కట్ అవుతోంది. రైతన్న ఉసూరుమంటూ మళ్లీ ఇంజిన్ వద్దకు పరుగుతీయాల్సిందే. గృహ వినియోగదారులనూ విద్యుత్ కోతలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మబ్బువేసినా.. గాలి వీచినా విద్యుత్ తీసేస్తుండడం, గంటల తరబడి సరఫరా పునరుద్ధరించకపోవడం వినియోగదారులను ఇక్కట్లకు గురిచేస్తోంది.



- గాలివీచినా.. చినుకు పడినా నిలిపివేత
- లైన్లు బాగోలేవంటూ గంటల తరబడి పవర్‌కట్
- నెల్లిమర్ల, బొండపల్లి, మెంటాడ మండలాల్లో రోజులో నాలుగు, ఐదుసార్లు కరెంట్ కోత
- బొబ్బిలి మండలంలో గంట నుంచి రెండు గంటల వరకు కోత విధింపు
- జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల సంఖ్య- 7,41,828
- ఆవేదనలో వినియోగదారులు

విజయనగరం ఫోర్ట్:

జిల్లా ప్రజలను విద్యుత్ కోతలు వేధిస్తున్నాయి. సమయపాలన లేకుండా.. ముందస్తుగా ఎలాంటి ప్రకటన లేకుండా అప్రకటిత విద్యుత్ కోతలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవలకు అంతరాయం కలుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యుత్ కోతలు జనానికి విసుగుతెప్పిస్తున్నాయి. వేసవిని తలపించేలా కోతలు విధించడంపై వినియోగదారులు మండిపడుతున్నారు.

ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా...

జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా కోతలు విధిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గంట నుంచి రెండు గంటల వరకు విద్యుత్ కోతలు విధించగా, మరి కొన్ని చోట్ల విడతలు వారీగా విద్యుత్ కోత విధిస్తున్నారు.

- బొబ్బిలి మండలంలో గంట నుంచి రెండు గంటల పాటు విద్యుత్ కోతవిధిస్తున్నట్టు విద్యుత్ వినియోగదారులు చెబుతున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, లేదంటే 12 గంటలవరకు విద్యుత్ కోతలు విధిస్తున్నారు.
- నెల్లిమర్ల, గంట్యాడ, బొండపల్లి, మెంటాడ మండలాల్లో పావు గంట పాటు రోజులో నాలుగు, ఐదు సార్లు విద్యుత్ కోత విధిస్తున్నారు. ఎందుకు అలా విద్యుత్ కోత విధిస్తున్నారని వినియోగదారులు అడిగితే లైను బాగోలేదని కారణాలు చెబుతున్నారు.

రైతులకు తప్పని ఇబ్బందులు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆకాశంలో చిన్న పాటి మబ్బు వేసినా వ్యవసాయ మోటార్లకు త్రీఫేస్ సరఫరా నిలిపివేస్తున్నారు. ప్రతిరోజు గ్రామీణ ప్రాంతాల్లో పదేపదే విద్యుత్ నిలిపివేయడం వల్ల వ్యవసాయ బోర్ల నుంచి పంటలకు సాగునీరు అందించే రైతులు ఇబ్బంది పడుతున్నారు. తరుచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల పంటలకు సకాలంలో నీరు అందడం లేదు. రోజులో నాలుగు, ఐదు సార్లు అనధికారికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు నిరంతరాయంగా 9 గంటల పాటు విద్యుత్ అందేది. గృహ వినియోగదారులకు కూడా 24 గంటల పాటు విద్యుత్ అందేది. అత్యవసరంగా విద్యుత్ కోత విధించాల్సి వస్తే అధికారికంగా ప్రకటించేవారు. దీనివల్ల సమస్యలు ఉత్పన్నమయ్యేవికావు. ప్రస్తుత పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉందని వినియోగదారులు వాపోతున్నారు.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు ఇలా..

కేటగిరీ వారీగా	కనెక్షన్ల సంఖ్య
1	6,04,535
2	65,194
3	2,822
4	14,168
5	55,109
మొత్తం:	7,41,828

ఎన్నికల సమయంలో ప్రచారం ఇలా...

అధికారంలోకి వస్తే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం. వ్యవసాయ మోటార్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తాం. విద్యుత్ కోతలే ఉండవు. చార్జీలు కూడా పెంచమంటూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఊరూరా ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ పక్కన పెట్టేశారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఇవ్వాల్సిన సమయంలోనూ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. అనధికారికంగా ఇష్టానుసారంగా కోతలు విధిస్తుండడంపై విద్యుత్ వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు.

ప్రతిరోజూ కోతే..



ప్రతిరోజు పావుగంట పాటు నాలుగు, ఐదుసార్లు కరెంట్ తీసేస్తున్నారు. ముందుగా చెప్పకుండా సరఫరా నిలిపివేస్తున్నారు. అధికారులను అడిగితే లైన్ బాగులేదని చెబుతున్నారు. గతంలో బాగుండే లైన్లు ఇప్పుడే బాగులేవా?.

– అంజలి అప్పలరాజు, కొండపర్తి గ్రామం, మెంటాడ మండలం

ఇబ్బందులు పడుతున్నాం



వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావడం లేదు. ప్రతిరోజు పలు మార్లు విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల పంటలకు సకాలంలో నీరు అందడం లేదు. కరెంట్‌పోతూ వస్తోంది. ఇంజిన్ వద్దకు తిరిగేసరికే సమయం సరిపోతోంది.

– నెట్టి ముకుంద, రైతు, బిళ్లల వలస, బొండపల్లి మండలం



కణపాక విద్యుత్ సబ్‌స్టేషన్

న్యూస్‌రీల్

నిండుకుండలా మడ్డువలస



మడ్డువలస రిజర్వాయర్

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. నదీ పరివాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 2 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 65 మీటర్లకు ప్రస్తుతం 64.33 మీటర్లు నమోదైంది. 2.72 టీఎంసీల నీరు ప్రాజెక్టులో ఉన్నట్టు ఏఈ నితిన్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం రెండు గేట్లు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ న్యాయవాదిగా రామకృష్ణ



పతివాడ రామకృష్ణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం జిల్లా గరివిడి మండలం అర్తమూరుకు చెందిన పతివాడ రామకృష్ణ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాది (జీపీ)గా నియమితులయ్యారు. రాజకీయ కుటుంబానికి చెందిన రామకృష్ణ దశాబ్దానికి పైగా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. మాజీ అడ్వకేట్ జనరల్ సత్తి సుబ్బారెడ్డి, మరో మాజీ అడ్వకేట్ జనరల్ సీవీ మోహన్‌రెడ్డి వద్ద జూనియర్‌గా వ్యవహరించారు. ఎన్నో కేసుల్లో వారికి సహకరించారు. జీపీగా రామకృష్ణ నియ మితులు కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టర్ దృష్టికి వర్సిటీ సమస్యలు



జాతీయ నూతన విద్యావిధానం పుస్తకాన్ని కలెక్టర్‌కు అందజేస్తున్న వీసీ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం భవన నిర్మాణ పనులను ప్రారంభించే అంశంపై చర్చించారు. ప్రస్తుత తాత్కాలిక క్యాంపస్‌లోని సమస్యలను తెలియజేశారు. జాతీయ విద్యా విధాన కమిటీలో సభ్యునిగా ఉండి రచించిన పుస్తకాన్ని కలెక్టర్‌కు బహూకరించారు. వర్సిటీ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ చెప్పారు.

'విజయ'కేతనం


- సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్ బాలుర, బాలికల విభాగాల్లో చాంపియన్‌గా నిలిచిన విజయనగరం



చాంపియన్‌గా నిలిచిన విజయనగరం క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న కేంద్రమంత్రి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం వేదికగా మూడు రోజులపాటు కన్నులపండువలా సాగిన సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్ ఘనంగా ముగిసింది. బాలబాలికలు రెండు విభాగాల్లోను విజయనగరం జట్లు చాంపియన్‌గా నిలవగా, ఆతిథ్య శ్రీకాకుళం జట్లు సైతం మెరిశాయి. బాలుర విభాగంలో రన్నరప్‌గా, బాలికల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే బాలికల విభాగంలో గుంటూరు రన్నరప్‌గా నిలవగా, బాలురులో అనంతపురం తృతీయ స్థానం, గుంటూరు నాల్గో స్థానాలతో సరిపెట్టుకున్నాయి.

శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా నిర్వహించిన 11వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల బాలబాలికల జట్లు హాజరయ్యాయి. ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందనప్పటికీ సాఫ్ట్‌బాల్ సంఘ జిల్లా అధ్యక్షులు కలిదిండి నరసింహరాజు నేతృత్వంలో నిర్వాహకులు మెరుగైన ఏర్పాట్లు చేశారు. విజేతలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.



బాలికల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన విజయనగరం క్రీడాకారిణులతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తదితరులు

ఎంపీటీసీ కుటుంబానికి ఆర్థిక చేయూత

- రూ.లక్ష ఆర్థిక సాయం చేసిన వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు



చింతపల్లి ఎంపీటీసీ-2 చిందాడ జయలక్ష్మికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ కోసం అనునిత్యం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని పాడేరు నియోజకవర్గం చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సెగ్మెంట్-2 బాధ్యతలు నిర్వహిస్తున్న చిందాడ జయలక్ష్మి భర్త ఇటీవల మృతి చెందారు. ఇంటి పెద్దను కోల్పోయామని, ఆర్థిక సాయం చేయాలని ఎంపీటీసీ జయలక్ష్మి వైఎస్సార్‌సీపీ అల్లూరు సీతారామరాజు జిల్లా అధ్యక్షురాలు కె.భాగ్యలక్ష్మికి విన్నవించారు. విషయాన్ని ఆమె జగన్‌మోహన్ రెడ్డికి తెలియజేయడంతో తగిన సహాయ సహకారాలు అందించాలని పార్టీ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావుకు సూచించారు. ఈ మేరకు సోమవారం భాగ్యలక్ష్మితో కలిసి వచ్చిన ఎంపీటీసీ జయలక్ష్మికి విజయనగరం జడ్పీ కార్యాలయంలో లక్ష రూపాయల చెక్కును అందజేశారు. భవిష్యత్తులో ఎటువంటి కష్టం వచ్చినా పార్టీ పరంగా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అరకు ఎంపీ బొమ్మ తనుజారాణి, పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వర రాజు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, చింతపల్లి ఎంపీపీ అనూషరాణి, తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు మాయం

డెంకాడ: మండల కేంద్రమైన డెంకాడలో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న బీరువాలో భద్రపరిచిన 21 తులాల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని డెంకాడ గ్రామానికి చెందిన నాలి నారాయణరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

- జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి వై.వి.రమణ

విజయనగరం ఫోర్ట్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ వై.వి.రమణ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వై.వి.రమణ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి ఆవులు, గొర్రెలు, మేకలలో వ్యాపించే అంటువ్యాధిగా పేర్కొన్నారు. ఇది జంతువుల పని సామర్థ్యం, పాడి ఉత్పత్తిని తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. 2025 నాటికి ఈ వ్యాధిని నియంత్రించాలని, 2030 నాటికి వ్యాధిని నిర్మూలించాలన్న లక్ష్యంతో భారత ప్రభుత్వం జాతీయ జంతు వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నాలుగు నెలల వయసు పైబడిన ప్రతి పశువుకు ఈ టీకా వేయించాలన్నారు. జాతీయ జంతు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో బ్రూసెల్లా వ్యాధి నివారణ టీకాలు నాలుగు, ఐదు నెలలు వయసు కలిగిన ఆడ దూడలకు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్వో ఎస్.డి. అనిత, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్


ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- సైనిక్ స్కూల్స్ ఇంటర్ గ్రూప్ స్పోర్ట్స్ అండర్ కల్చరల్ మీట్ ప్రారంభం
- పోటీలను ప్రారంభించిన కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి

విజయనగరం: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ నేషనల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో పాల్గొనబోయే గ్రూప్-ఎఫ్ జోన్‌కు సంబంధిచిన ఇంటర్ గ్రూప్ పోటీలు విజయనగరం మండలంలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీల్లో ఆతిథ్య కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థులతో పాటు అంబికాపూర్, భువనేశ్వర్, సంబల్‌పూర్ సైనిక్ స్కూల్‌కు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్. శాస్త్రి ప్రారంభించగా... వివిధ స్కూల్స్ నుంచి వచ్చిన విద్యార్థుల నుంచి క్రీడా వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. పరుగు, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడాంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు క్రీడాకారులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థి స్థాయిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు క్రీడలు చక్కని వేదికగా నిలుస్తాయని, ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో తలపడి తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్/వింగ్ కమాండర్ వి.కిరణ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/ లెఫ్టినెంట్ కమాండర్ అభిలాష్ బాలచంద్రన్‌తో పాటు పాఠశాలల సిబ్బంది, క్యాడెట్‌లు పాల్గొన్నారు.



సైనిక్ స్కూల్ ఇంటర్ గ్రూప్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌ను ప్రారంభిస్తున్న కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి



పరుగు పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పారిశ్రామికాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్:

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం సోమవారం జరిగింది. 2024–2029 సంవత్సరాల మధ్య రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించనున్న నేపథ్యంలో జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించే అంశంపై సమావేశంలో చర్చించారు. వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకోసం వచ్చే దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలో సింగిల్ విండో పద్ధతిలో ఆమోదిస్తామని తెలిపారు. భూములకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే సంప్రదించాలని పారిశ్రామిక వేత్తలకు సూచించారు. పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీకి కేటాయించిన స్థలాలను అభివృద్ధిచేసి, వీలైనంత వేగంగా పారిశ్రామిక వేత్తలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో సమస్యలు పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు కృషిచేస్తామన్నారు. జేసీ ఎస్.సేతుమాధవన్ మాట్లాడుతూ జిల్లాలోని వనరులు, అవసరాలు, పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అందుకు అనువైన పరిశ్రమలను స్థాపించేలా, పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకొనేలా సంబంధిత అధికారులు, నిపుణులు చర్చించి ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. సమావేశంలో పరిశ్రమల డీడీ నాగేశ్వరరావు, సీపీఓ పి.బాలాజీ, ఏపీఐఐసీ ఏఎం బి.రామకృష్ణ, జేడీఏ వీటీ రామారావు, ఎల్‌డీఎం ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సరిత, జిల్లా రిజిస్ట్రార్ కుమారి, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్

చేనేత రంగం పరిశ్రమగా ఎదగాలి

జిల్లాలో చేనేత రంగాన్ని పరిశ్రమ స్థాయికి అభివృద్ధి చేసేందుకు తగిన ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. చేనేత జౌళిశాఖ అధికారులు, సొసైటీల ప్రతినిధులతో తన చాంబర్‌లో సోమవారం సమీక్షించారు. రాష్ట్రప్రభుత్వం త్వరలో నూతన టెక్స్‌టైల్ పాలసీని రూపొందించనుందని, దీనికోసం జిల్లా నుంచి అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని చెప్పారు. జిల్లాలో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులు ఉన్నప్పటికీ వీరిలో చాలా మంది వృత్తికి దూరంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 23 చేనేత సహకార సంఘాలల్లో సుమారు 2,500 మంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారని, వీరిలో కేవలం 9 మంది మాత్రమే ప్రస్తుతం చురుకైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సమావేశంలో సీపీఓ పి.బాలాజీ, చేనేత జౌళిశాఖ ఏడీ ఆర్‌ఈ మురళీకృష్ణ, అభివృద్ధి అధికారులు వసంత, శంకరరావు, ఆప్కో, సొసైటీల మాజీ అధ్యక్షుడు వెంకటరమణ, కొండపల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా రాఖీ వేడుక

రాఖీపౌర్ణమి వేడుకలు జిల్లాలో ప్రేమానురాగాల నడుమ సాగాయి. చిన్నాపెద్దా, ధనికపేద తారతమ్యం లేకుండా సోదర భావంతో రాఖీ పండగను జిల్లా వాసులు సోమవారం జరుపుకొన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం జిల్లా శాఖ సభ్యులు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నగరపాలక సంస్థ డిప్యూటీ చైర్మన్ కోలగట్ల శ్రావణి తదితరులకు రాఖీలు కట్టారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జి అన్నపూర్ణ తెలిపారు. రక్షా బంధన్ విశిష్టతను వివరించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి ఆశీర్వాదం అందుకున్నారు. – విజయనగరం టౌన్



ఎస్పీ వకుల్‌జిందాల్‌కు రాఖీకడుతున్న బ్రహ్మకుమారీలు



పోలీస్ అన్నా.. మీ రక్షణే మాకు శ్రీరామరక్ష



విద్యార్థి సోదరులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

క్లుప్తంగా

23న గ్రామసభలు నిర్వహించాలి

- అధికారులతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పార్వతీపురం: జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 23న గ్రామసభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాలిన్సిన పనులను, వాటి వివరాలను పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామ పంచాయతీలో పారిశుధ్యంపై స్థానిక ఎంపీడీఓను ప్రశ్నించారు. పంచాయతీలో పారిశుధ్యం సక్రమంగా లేదని, ఫైలేరియా వ్యాధి వ్యాప్తి ఉందని తమ దృష్టికి వచ్చిందని, దానిపై చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని ఎంపీడీఓను ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టాలిన్సిన ప్రాజెక్టుల విషయంలో గ్రామ పంచాయతీ బాధ్యత వహించాలని సూచించారు. వార్డు సభ్యులు పనులను అమలు చేయడం, పర్యవేక్షించడం చేయాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ ప్రాంతంలో చేపట్టాల్సిన పనులు, ప్రాజెక్టుల ఆమోదం కోసం అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ బి. సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకర రావు, డ్వామా పీడీ రామచంద్ర రావు, పీఆర్ ఈఈ కృష్ణాజీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లఘుచిత్ర ప్రదర్శనలో పెంట విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామ జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు జీవ వైవిధ్యం-యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి లఘుచిత్ర ప్రదర్శన పోటీల్లో ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు. ఈనెల 12న విజయనగరంలోని కస్పాహైస్కూల్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రదర్శించిన పాఠశాల పదోతరగతి విద్యార్థులు ఎం.స్పందన, సీహెచ్ అలేఖ్యలను జిల్లా విద్యాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అభినందించారు. వారికి శిక్షణ ఇచ్చిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కునుకు సింహాచలానికి డీఈఓ ప్రత్యేకాభినందనలు తెలిపారు.

పెదకుదమలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ పంటపొలాల్లో సోమవారం ఏనుగులు దర్శనమిచ్చాయి. వరిపంట ఉబాలు పూర్తి కావడం, అరటి పంటదశలో ఉండడం, పామాయిల్ తోటలు విస్తృతంగా ఉండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాన ఏనుగులు గ్రామాల్లోకి వచ్చే ఆవకాశముందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏనుగుల సమస్య పరిష్కారానికి ప్రణాళిక



అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: కొన్నేళ్లుగా కురుపాం నియోజకవర్గంలో తిష్ట వేసిన ఏనుగుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అటవీశాఖ అధికారులతో అన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ ఆఫీస్‌లో సోమవారం ఆమె అటవీశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా ఉండకుండా ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేసుకోవాలని, ఏనుగుల సంచారం సమాచారం ఎప్పటికప్పుడు సమీప గ్రామస్తులకు అందజేయాలని, గిరిజనులకు డీ పట్టాలు మంజూరు చేసేందుకు పెండింగ్‌లో ఉన్న అటవీ అనుమతులు మంజూరు చేయాలని అటవీశాఖ అధికారులను కోరారు. సమావేశంలో కురుపాం రేంజర్ మణికంఠేశ్వర రావు, జియ్యమ్మవలస ఎంపీపీ బొంగు సురేష్, టీడీపీ నాయకులు డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్ కుమార్, పోలూరు శ్రీనివాసరావు, టీఆర్‌ఎఫ్ అధ్యక్షుడు రొబ్బా లోవరాజు తదితరులున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹216

దోమల నివారణ దినంగా ఎందుకంటే..

ప్రపంచానికి కామన్ శత్రువుగా మారిన దోమల ఆట కట్టించడానికి సర్ రోనాల్డ్ రాస్ శతాబ్దం క్రితమే రంగంలోకి దిగారు. 1897లో ఆయన దోమల ద్వారానే మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని నిర్ధారించారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆగస్టు 20న అంతర్జాతీయ దోమల నివారణ దినంగా లండన్ స్కూల్ ఆఫ్ హైజెనిక్ అండ్ ట్రాపికల్ మెడిసన్ ప్రకటించింది.





ఇళ్లల్లో దోమల నివారణకు స్ప్రే చేస్తున్న కార్మికులు

పొంచి ఉన్న రక్త పిశాచాలు



పారిశుధ్యంపై సూచనలిస్తున్న సిబ్బంది

- నివారించకపోతే ప్రమాదమే
- రోజురోజుకు వృద్ధి చెందుతున్న దోమలు
- పెరిగిపోతున్న మలేరియా, డెంగీ కేసులు
- నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

సీతంపేట: చిన్నదోమ ఎంత పెద్ద ప్రమాదాన్ని తీసుకువస్తుందో చెప్పడానికి మలేరియా, డెంగీ, చికున్ గున్యా లాంటి జ్వరాలే ఉదాహరణ. పట్టణాలతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల కాలంలో రోజురోజుకు మలేరియా, డెంగీ కేసుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో ఎక్కువ మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిన వారి సంఖ్యకూడా ఎక్కువగానే ఉంటోంది.

దోమలను అరికట్టేదెలా..?

దోమ ఎగురుతున్నపుడు పట్టుకోవడం, చంపడం చాలా కష్టమైన పని. ఒక్క దోమను పట్టుకోవాలంటే ఎంతో శ్రమించాలి. అయితే దోమలు నీటిలో లార్వా, ప్యూపా దశలో పెరుగుతున్నప్పుడు నాశనం చేయడం చాలా సులువు. ఇవి ఇంటిలో నీటిని నిల్వ చేసే కుండీల్లో చిన్నచిన్న పురుగుల్లా కనిపిస్తుంటాయి. వాటిని చాలా మంది నీటి పురుగులు, జలగలు అని పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు (లార్వా) నిల్వ నీటిలో ఉన్నట్లయితే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి. ఇలా చేయడం వల్ల లార్వా, ప్యూపా దశల్లో ఉన్న వాటిని వందల సంఖ్యలో నాశనం చేయవచ్చు. దోమలు నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడతాయి. ఒక దోమ వంద నుంచి 200 వరకు గుడ్లను పెడుతుంది. ఇవన్నీ కేవలం 8 నుంచి 10 రోజుల్లో దోమలుగా మారిపోతాయి. గుడ్డు నుంచి లార్వా, ప్యూపా, అడల్ట్ మస్కిటోగా రూపాంతరం చెందుతాయి.

దోమలపై దాడికి లక్షల్లో ఖర్చు

దోమలు ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతి నెల పచారి సమాగ్రి మాదిరిగానే లిక్విడ్స్, మస్కిటో రీఫిల్స్, కాయిల్స్, మస్కిటో ధూప్ స్టిక్స్ వంటి వాటికి నెలకు రూ.100 నుంచి రూ.500 వరకు ఒక్కో కుటుంబం ఖర్చు చేస్తోంది. ఇవి కాకుండా దోమల బ్యాట్స్, దోమతెరలు, యాంటి మస్కిటో మెస్ వంటి వాటికోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించక తప్పడం లేదు. దోమ కాటు వల్ల వచ్చే వ్యాదుల నివారణకు ప్రత్యేకంగా ఖర్చు చేయాల్సిందే.

ఆడదోమలే ప్రమాదకరం..

మగ దోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతాయి. ఆడ దోమలు మాత్రం సంతానాభివృద్ధిలో భాగంగా గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీల్చుతుంటాయి. ఈ క్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ రక్తాన్ని పీల్చినప్పుడు రక్తంతో పాటు వ్యాధి కారకమైన పారాసైట్ దోమ లాలాజల గ్రంధుల్లోకి చేరుతుంది. అక్కడ పారాసైట్‌లో కొన్ని మార్పులు జరుగుతాయి. మరో ఆరోగ్యవంతమైన వ్యక్తిని దోమ కుట్టినప్పుడ దాని లాలాజలంతో పాటు పారసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులకు కారణమవుతుంది.

అనర్థాలివే..

ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా,డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి జ్వరాలు, ఈడిస్, క్యూలెక్స్ దోమలవల్ల బోదకాలు వస్తాయి.

నివారణ ఇలా..

దోమలు కుడితే ఎంతటి ప్రాణాంతక విష జ్వరాలు ప్రబలుతాయో అందరికీ తెలిసిందే మలేరియా, డెంగీ వంటి జ్వరాలకు దోమలే కారణం. మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ వంటివి దోమల నివారణకు ఇంట్లో వాడతాం. వాటివల్ల కొందరికి శ్వాసకోస వ్యాధులు వస్తాయి. ఈ నేపథ్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టడమే ఉత్తమం.

- వేపనూనె దోమలను తరిమికొట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దీని వాసన దోమలు భరించలేవు.
- వేప, కొబ్బరినూనెలను సమాన భాగాలుగా చేసుకుని బయటకు కనిపించే శరీర భాగాలపై రాసుకుంటే దోమలు దరిచేరవు.
- ఇళ్లల్లోకి దోమలు ప్రవేశించే కిటికీల వంటి ద్వారాల వద్ద తులసి మొక్కలను పెంచాలి. ఇవి దోమలను దూరం చేస్తాయి. దోమలను వృద్ధి కాకుండా చూస్తాయి.
- లెమన్, యూకలిప్టస్ ఆయిల్ మిశ్రమం దోమలను తరిమికొడుతుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ సెప్టిక్‌గానే కాకుండా ఇన్‌స్టెక్ రిప్లెంట్‌గాను పనిచేస్తుంది.
- కర్పూరం మెరుగ్గా పనిచేస్తుంది. ఖాళీ ప్రదేశాలను మూసిన తర్వాత కర్పూరాన్ని వెలిగిస్తే దానినుంచి వచ్చే పొగకు దోమలు మాయమవుతాయి.

అప్రమత్తంగా ఉండాలి



దోమల నుంచి వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రస్తుతం తగ్గుముఖం పడుతున్నాయి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. రెండు దఫాలుగా దోమల నివారణ మందును మలేరియాశాఖ ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ చేశాం.

– విజయపార్వతి, డీఎంహెచ్‌వో

పారిశుధ్యంపై చైతన్యం



పారిశుధ్యంపై గ్రామాల్లో చైతన్య, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. గ్రామాల్లో దోమతెరల వినియోగంపై గిరిజనులకు చైతన్యం చేస్తున్నాం.

– జి.మోహన్‌రావు, మలేరియా నివారణా సబ్‌యూనిట్ ఆఫీసర్, సీతంపేట

వినతుల పరిష్కారానికి కమాండ్ కంట్రోల్ రూమ్

- అర్జీదారులకు కచ్చితమైన సమాధానం పంపాలి
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతుల పరిష్కారానికి ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు అన్ని శాఖల నుంచి సిబ్బందిని ఒక్కొక్కరు వంతు ఈ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో డిప్యూట్ చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భోగంగా అధికారులతో కలెక్టర్ మాట్లాతూ కలెక్టరేట్‌కు వచ్చే వినతులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని, అర్జీదారులతో మాట్లాడి, అర్జీదారు సంతృప్తి చెందిన తర్వాతనే వారి ఫొటోతో పాటు సమాధానాన్ని అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఉండాలని రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని సూచించారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలన్నారు. వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని స్పష్టం చేశారు.

129 వినతులు

సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మధవన్, ఆర్‌డీఓ ఎస్‌డీ అనిత ప్రజల నుంచి 129 వినతులు స్వీకరించారు.

ఎస్‌కోట మేజర్ పంచాయతీ ఆస్తులు పరిరక్షించాలి

ఎస్‌కోట మేజర్ పంచాయతీ ఆస్తులను అక్రమంగా దోచుకుంటున్న వారి దారుణాలను అడ్డుకోవాలని ఆ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌తో పాటు వార్డు సభ్యులు పలువురు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి కోరారు. మేజర్ పంచాయతీ పరిధిలోని పంచాయతీ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ప్రైవేట్ వ్యక్తి గృహ నిర్మాణం చేశారు. అయితే ఆయన అప్రూవ్డ్ స్థలాన్ని ఆనుకుని ఉన్న ప్రధాన కాలువపై వరకు నిర్మాణం చేపట్టారు. ఆ గృహం నిర్మాణ అప్రూవల్ రద్దు చేయాలని వార్డు సభ్యులు తీర్మానం చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. సర్పంచ్, విస్తరణాధికారులు ఆ తీర్మానాన్ని పట్టించుకోకుండా ఆక్రమణదారునికి మద్దతు ఇస్తున్నారని అర్జీలో పేర్కొన్నారు. అదే విధంగా పంచాయతీ నిర్మాణాల్లో అద్దెకు ఇచ్చి వాటిలో అక్రమాలు అరికట్టాలని కోరారు. పంచాయతీ తీర్మానం ప్రకారం ఒక్కో దుకాణానికి రూ.27 వేలు రావాల్సిన చోట కేవలం రూ.2,700 మాత్రమే అద్దెలను వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని అర్జీలో వివరించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

జొందపల్లి: మండలంలోని గరుడుబిల్లి-గొట్లాం గ్రామాల మధ్య ఒంపల్లి రైల్వే వంతెన సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లుగా గమనించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు విజయనగరం రైల్వే ఎస్సై సోమవారం తెలిపారు. మతునికి 65 సంవత్సరాలు ఉంటాయని, శరీరంపై తెల్లరంగు షర్టు, రెడ్ కలర్ లుంగీ ధరించి ఉన్నట్లు తెలిపాడు. రైలు నుంచి ప్రమాదశావత్తు జారి పడి కానీ, పట్టాలు దాటుతుండగా కానీ రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో భద్రపరిచామని అచూకీ తెలిసిన వారు సంప్రదించాలని కోరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



రాము మృతదేహం

దెంకాడ: మండలంలోని అమకాం బస్‌స్టాప్ సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పడంతో తుప్పల్లో పడిపోయిన ముంజేరు గ్రామానికి చెందిన పిడుగు రాము(25) అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు ఎస్సై ఎ.సన్యాసినాయుడు సోమవారం తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సన్‌రేలో కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రాము ఆదివారం రాత్రి మోటార్‌సైకిల్‌పై వెళ్తూ అదుపు తప్పి తుప్పల్లో పడిపోయాడు. రాత్రి 10:30 గంటల ప్రాంతంలో మరణించి ఉంటాడని, సోమవారం సాయంత్రం మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీల్లో బహుమతులు అందుకున్న విజేతలతో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

జిల్లా వేదికగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సీనియర్ స్త్రీ, పురుషుల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. మూడు రోజులుగా జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో భాగంగా ఉమెన్ సింగిల్స్ విభాగంలో టి.సూర్య (కృష్ణా జిల్లా), నవ్య (చిత్తూరు)లు మొదటి, రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. మెన్స్ సింగిల్స్ విభాగంలో విశాఖకు చెందిన బాల ప్రణయ్, తూర్పుగోదావరికి చెందిన భార్గవ శ్రీరామ్‌లు విజేతలుగా నిలిచారు. అదేవిధంగా ఉమెన్స్ డబుల్స్ విభాగంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఆకాంక్ష, కృష్ణాజిల్లాకు చెందిన మార్నిత్యాల జట్టు ప్రథమ స్థానం దక్కించుకోగా, గుంటూరు జిల్లాకు చెందిన బి.స్రవంతి, డి.దీపికలు ద్వితీయ స్థానంలో నిలిచారు. మెన్స్ డబుల్స్ విభాగంలో భార్గవ్‌రామ్, విశ్వతేజ్‌ల జట్టు మొదటిస్థానంలో, కె.శ్రీమోహిత్, షేక్ ముమేయర్‌లు ద్వితీయస్థానంలో నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భార్గవరామ్, రష్మితల జోడి ప్రథమస్థానం, ఎ.వంశీ కృష్ణ రాజ్, సూర్య కరిష్మాల జోడీ ద్వితీయస్థానం దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విజేతలను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో కాకినాడ, బెంగళూరుల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆశించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ కేవీ.నాయుడు, ఇందుకూరి రఘురాజు, డాక్టర్ వీఎస్.ప్రసాద్, ఎంకేబీ శ్రీను, ఎన్.సురేష్, వై.కుసుంబచ్చన్, పొట్నూరు శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీ. సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

మాజీ మంత్రి బొత్సను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసిన వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి మండల నాయకులు

చీపురుపల్లి: మాజీ మంత్రి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి మండల నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు నాయకులు విశాఖపట్నం వెళ్లి ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై స్థానిక నేతలు తమ సంతోషాన్ని ఆయనతో పంచుకున్నారు. కార్యక్రమంలో పతివాడ రాజారావు, దన్నాన జనార్దనరావు, రేవల్ల సత్తిబాబు, రఘుమండ త్రినాథ్, పనస అప్పారావు, కోరాడ పృథ్వి, గిరడ రాందాసు, కొమ్ము చిరంజీవి, ముల్లు పైడిరాజు, కోరుకొండ దాలయ్య, కర్రోతు ప్రసాద్, ఎల్.ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

హామీని వెంటనే అమలు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న తవిటినాయుడు

బలిజిపేట: ప్రభుత్వ ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టు లాంటి 117జీఓను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని పీఆర్‌టీయూ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు వాలేటి తవిటినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బలిజిపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే ఇవ్వాలి. గతంలో ఉన్నత పాఠశాలల్లో హేతుబద్ధీకరణ వల్ల పోయిన ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను రోల్ ప్రాప్తికి వెంటనే మంజూరుచేయాలి. ప్రతి పాఠశాలలో కలనీసం ఇద్దరు ఉపాధ్యాయులను, తరగతికి ఒకరు వంతున నియమించాలని, ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్లను, నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాలి. పాఠశాల గ్రాంట్లు విడుదల చేయాలి. యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాంబమూర్తి, మండలశాఖ ప్రధాన కార్యదర్శి ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

పసర మందుతో చిన్నారికి అస్వస్థత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ మూలజమ్ము గ్రామంలో పసర మందు పట్టడంతో నాలుగు నెలల చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురైంది. వివరాలిలా ఉన్నాయి. భామినికి చెందిన బిడ్డిక అశ్విని తన నాలుగు నెలల పాప సహస్రను వెంటబెట్టుకుని కొన్ని రోజుల క్రితం తాతగారింటికి మూలజమ్ము వచ్చింది. రెండు రోజులుగా సహస్రకు జ్వరం రావడంతో స్థానికంగా ఇచ్చిన పసరమందు పట్టారు. అయితే సహస్ర కడుపునొప్పి, ఆయాసం, విరేచనాల బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో సోమవారం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

పీఏసీఎస్ కంప్యూటరీకరణ పూర్తి చేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్




సహకార కార్యాలయంలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులు వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన సహకారశాఖ కార్యాలయంలో వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులను పరిశీలించారు. కంప్యూటరీకరణ పనులకు సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగిన సభ్యులందరి వివరాలను కంప్యూటరీకరించాలని చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను స్వావలంబన చేయడానికి భారత ప్రభుత్వం కంప్యూటరీకరణ ప్రక్రియను చేపట్టిందని, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుకు సదరు డేటా జాతీయస్థాయిలో అనుసంధానం అవుతుందని, తద్వారా పీఏసీఎస్ కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచడం, రుణాలను వేగంగా పంపిణీ చేయడం, లావాదేవీల ఖర్చులను తగ్గించడం, చెల్లింపులలో అసమతుల్యతను తగ్గించనున్నారని చెప్పారు. సంఘాల కార్యకలాపాలలో పారదర్శకత పెరుగుతుందని, రైతులలో పీఏసీఎస్ పనితీరులో విశ్వసనీయత పెరుగుతుందన్నారు. కామన్ అకౌంటింగ్ సిస్టమ్ (సీఏఎస్), మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) అమలు ద్వారా పీఏసీఎస్‌లలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని, రుణాలు, రుణాల రీషెడ్యూల్ పనులలో రైతులకు సేవలు అందించవచ్చని స్పష్టం చేశారు. జిల్లా కో ఆపరేటివ్ అధికారి పి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

పార్వతీపురం: నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక, గృహ నిర్మాణం, సంపూర్ణ పోషణ అభియాన్, పీఏసీఎస్ కంప్యూటరీకరణ, ఈ-పంట తదితర అంశాలపై సమీక్షించారు.

విశ్వభాషలందు వెలుగు తెలుగు



ప్రముఖ గజల్స్ గాయకుడు వినోద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: విశ్వభాషలందు వెలుగు తెలుగు అని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. తెలుగువారమనే ముద్ర భాష కారణంగానే వస్తుందని, ప్రపంచంలో తెలుగు ప్రతిభకు జై కొట్టని దేశం లేదని, తెలుగువారు రాణించని రంగమే లేదని పేర్కొన్నారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తెలుగుభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురజాడ విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ గజల్స్ గాయకుడు వినోద్‌తో తెలుగు భాష పరిరక్షణకు సంబంధించిన గజల్స్ పాడించారు. గజల్స్ వినోద్ తన గానం ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌తో కలిసి గజల్స్ వినోద్‌ను గురుప్రసాద్ సత్కరించారు.